గజ్జెల లాగులు.. ఢమరుక నాదాలు.. డోలు చప్పళ్లు.. అర్చకుల పూజలు.. ఒగ్గు పూజారుల పట్నాలు.. పోతరాజుల విన్యాసాలు.. మహిళల బోనాల సమర్పణతో సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న క్షేత్రం పులకించిపోయింది. ఆది వారం పట్నం వారంతో క్షేత్రంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. స్వామివారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. మల్లన్న నామస్మరణతో క్షేత్రం పరవశించింది.

మల్లికార్జున స్వామి వారి ఆలయంలో అర్చకుడి పూజలు

పట్నం.. పరవశం

కోటి దండాలయ్యా.. కోరమీసాలయ్య

- మల్లన్న దర్శనంతో పులకించిన భక్తజనం
- తొలిరోజు 75వేల మంది భక్తుల రాక
- నేడు కొమురవెల్లి క్షేత్రంలో పెద్ద పట్నం, అగ్నిగుండం

ఒగ్గు పూజారితో పట్నం వేయించి మొక్కు చెల్లించుకుంటున్న భక్తులు

కొమురవెల్లి ఆలయ రాజగోపురం వద్ద భక్తుల రద్దీ

చేర్యాల, జనవరి 21: కొమురవెల్లి మల్లన్న ఉత్సవాలు పట్నం వారంతో ఆది వారం వైభవంగా ప్రారంభం కాగా.. 75వేల మంది భక్తులు తరలివచ్చారు. బ్రహ్మోత్సవాల్లో మొదటి వారం పట్నం వారంగా పిలువడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం చిలుక పట్నం, గంగరేగు చెట్టు వద్ద నజరు పట్నం, మహామండపంలో ముఖమండప పట్నాలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. చేర్యాల, సిద్దిపేట, హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, జనగామ తదితర జిల్లాల నుంచి భక్తులు ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ వాహనాల్లో భారీగా కొమురవెల్లి క్షేత్రానికి తరలివచ్చారు.

బియ్యం గింజపై రామమందిరాన్ని గీసిన నర్సంపేట కళాకారుడు శ్రీరామోజు జయకుమార్

వరంగల్ కలీమాబాద్‌లో విద్యార్థులు వేసిన అయోధ్య రామమందిరం, సీతారాముల రంగవల్లులు

రామనామమే జగమంతా..!

నేడు అయోధ్యలో బాల రాముడి ప్రాణప్రతిష్ఠ

అయోధ్యలో అపూర్వ ఘట్టానికి వేళయిన సందర్భాన జగమంతా రామనామం స్మరిస్తోంది. సోమవారం బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ జరుగనున్న నేపథ్యంలో భక్తిభావం వెల్లివిరుస్తోంది. ఇప్పటికే ఇంటింటికీ 'అయోధ్య అక్షింతలు' చేరగా నేడు పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆలయాలు ముస్తాబయ్యాయి. అలాగే అయోధ్య లైవ్‌ను వీక్షించేందుకు పలు ఆలయాల వద్ద ఎల్ ఈడీ స్క్రీన్లు సిద్ధం చేయగా ఊరూవాడ రామనామంతో మార్మోగనున్నది. *- నమస్తే నెట్‌వర్క్, జనవరి 21*

నేడు పెద్దపట్నం, అగ్నిగుండం

హైదరాబాద్ ఒగ్గు పూజారుల సంఘం ఆధ్వర్యంలో భక్తులు మల్లన్న క్షేత్రంలోని కల్యాణ వేదిక వద్ద సోమవారం పెద్దపట్నం వేసి అగ్నిగుండం తయారు చేయనున్నారు. పట్నం వారానికి వచ్చిన భక్తులు పెద్దపట్నం, అగ్నిగుండం దాటి స్వామివారిని మరోసారి దర్శించుకుంటారు. అనంతరం నల్లపోచమ్మ, కొండపోచమ్మ ఆలయాలకు వెళ్లి అక్కడ అమ్మవార్లకు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు.

టెక్నోజియాన్.. అదిరెన్

నిట్‌లో ఉత్సాహంగా ముగిసిన కార్యక్రమం

- మూడు రోజులుగా పోటాపోటీగా ఎగ్జిబిట్ల ప్రదర్శన
- పెద్ద సంఖ్యలో తరలివచ్చి వీక్షించిన విద్యార్థులు
- కలలను నిజం చేసుకోవాలి : ఇస్రో శాస్త్రవేత్త టీఎన్ సురేశ్ కుమార్

నయీంనగర్, జనవరి 21 : నిట్‌లో టెక్నోజియాన్-2024 ఆదివారం ఉత్సాహంగా ముగిసింది. చివరి రోజు ఆదివారం విద్యార్థులు ప్రదర్శించిన ఎగ్జిబిట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రైవేట్ పాఠశాలల నుంచి పెద్ద సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి వాటిని తిలకించారు. చిన్న పడవను రిమోట్‌తో నియంత్రిస్తూ గమ్యాన్ని చేరుకొనే 'జహాజ్' ఎగ్జిబిట్ ప్రదర్శించి, విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.18వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10వేలు అందించారు. రిమోట్ కంట్రోల్డ్(ఆర్సీ) కార్లతో ట్రాక్‌లో 'ఆర్సీ రేసింగ్' ప్రదర్శించారు. కాగా, నిట్‌లోని అంబేద్కర్ లర్నింగ్ సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త డాక్టర్ టీఎన్ సురేశ్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు కలలను నిజం చేసుకోవాలని సూచించారు. కొవిడ్ సమయంలో ఇస్రో చేసిన సేవలను దేశం మరువలేనివన్నారు. ఇస్రోలో పనిచేసేందుకు యువతీ యువకులు ముందుకురావాలని పిలుపునిచ్చారు. నిట్, ఐఐటీల నుంచి వచ్చిన విద్యార్థులు అంతరిక్ష పరిశోధనల్లో గొప్ప పాత్ర పోషించాల్సి ఉందన్నారు. భూగోళంపై మొత్తం ప్రయాణాన్ని పూర్తి చేయడానికి తనకు ఇంకా 25 దేశాలు మాత్రమే మిగిలి ఉన్నాయని, మరో రెండేళ్లలో పూర్తిచేస్తానన్నారు. సబ్‌మెరైన్ నుంచి అంతరిక్షంలోకి వెళ్లిన తొలి భారతీయ శాస్త్రవేత్త కావాలని ఆకాంక్షిస్తున్నానని తెలిపారు. తన భార్య కూడా ఇస్రోలో పనిచేస్తోందని చెప్పారు. విద్యార్థులు ప్యాకేజీలను మాత్రమే పరిగణలోకి తీసుకోకుండా దేశాభివృద్ధికి పరిశోధనల గురించి ఆలోచించాలని సూచించారు.

మాట్లాడుతున్న ఇస్రో శాస్త్రవేత్త సురేశ్‌కుమార్ — నిట్‌లో యువతులు — 'జహాజ్' ఎగ్జిబిట్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

దళితబంధు నిధులు జమ చేయాల్సిందే..

- ఈ నెల 25న ములుగులో నిరసన దీక్ష
- దళితబంధు సాధన సమితి ములుగు జిల్లా అధ్యక్షుడు కోకిల మహేశ్
- విజయవంతం చేయాలని పిలుపు

ఏటూరునాగారం, జనవరి 21: దళితబంధు రెండో విడుత నిధులను వెంటనే లబ్ధిదారుల ఖాతాల్లో జమచేయాలని దళితబంధు సాధన సమితి జిల్లా అధ్యక్షుడు కోకిల మహేశ్ కోరారు. ఇందుకోసం ఈ నెల 25న ములుగు జిల్లాకేంద్రంలోని గాంధీ పార్కు వద్ద ఒక్కరోజు నిరసన దీక్ష చేపడుతున్నామని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు జిల్లాలోని లబ్ధిదారులంతా కలిసి రావాలని ఆయన కోరారు. ఈమేరకు ఆదివారం లబ్ధిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం రెండో విడుత లబ్ధిదారులను ఎంపిక చేసి కలెక్టర్ ఆధ్వర్యంలో గ్రౌండింగ్ పూర్తి చేయడం వల్ల ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యాయని చెప్పారు. కలెక్టర్ బ్యాంకు ఖాతాలో రూ.26.49 కోట్లను జమచేశారని, అంతేకాకుండా లబ్ధిదారులతో ఖాతాలు కూడా తెరిపించారన్నారు. ఎన్నికల కోడ్ రావడంతో లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు జమ చేయలేదని, ఎన్నికలు పూర్తయి నెల రోజులు గడుస్తున్నా నేటికీ జమ చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వాన్ని, అధికారులను లబ్ధిదారులు శాంతియుతంగా కోరుతున్నట్లు తెలిపారు.

ఈ నెల 25న నిర్వహించే నిరసన దీక్షకు దళితబంధు లబ్ధిదారులు, దళిత సంఘాల నాయకులు, మద్దతుదారులను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వివిధ మండలాల సాధన సమితి అధ్యక్షులు, లబ్ధిదారులు కర్రి శ్యాంబాబు, శ్రీనివాస్, దర్శనాల సంజీవ్, చిన్ని కృష్ణ, రామకృష్ణ, రాజేశ్, చంద్రబాబు, ఓంకార్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న దళితబంధు లబ్ధిదారులు